# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 218 | విశాఖపట్నం | 9-5-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 218 | VISAKHAPATNAM | 9-5-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | SBI Pay | G Pay | Paytm | Pay




5లో

చకచకా రెండు లేన్ల జాతీయ రహదారి నిర్మాణం

## రోడ్లు పనుల్లో నాణ్యతా లోపం

పూర్తికాకుండానే కోతకు గురైన వైనం



4లో



6లో

'అధిక కొలెస్ట్రాల్'తో బాధపడుతున్నారా?

### మెరుగైన పాలనకు కలెక్టర్లు

# వినూత్నంగా ఆలోచించాలి

**రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు**





**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజు శుక్రవారం కొనసాగుతోంది. కొనసాగుతోంది. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత టైమ్ వృధా అవుతుందో ఆలోచించాలని అన్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ.. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు. వాట్సాప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఇప్పటికే 29 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చామని.. 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ నాటికి అన్ని సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని ఆదేశించారు. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. పిడుగుల హెచ్చరికలను జారీ చేయటంలో ఇంకా పర్ఫెక్షన్ రావాలన్నారు. తుఫాన్ల హెచ్చరికల సమయంలో నేరుగా మొబైళ్లకే మెసేజ్‌లు పంపించాలని తెలిపారు. తుఫాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ, వార్డుల ద్వారా కూడా పంపించాలని అన్నారు. సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లో గ్రీవియన్స్ స్వీకరిస్తున్నట్లే... ఇకపై ప్రతి శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో గ్రీవియన్స్ స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డేగా (తరువాయి 2వ పేజీలో)



## తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై కొనసాగుతున్న

# ప్రతిష్టంభన!



- గవర్నర్‌ను కలిసి.. ప్రభుత్వ ఏర్పాటు అవకాశమివాలన్న విజయ్
- సంఖ్యాబలం చూపించాలంటున్న గవర్నర్
- టీవీకేకి మద్దతు ఇస్తామంటున్న సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు
- 10వ తేదీ వరకూ వేచి చూస్తామంటున్న డీఎంకే, అన్నాడీఎంకే
- గవర్నర్ తీరుపై మండిపడుతున్న కాంగ్రెస్, సినీ నటులు, రాజకీయ నిపుణులు

**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా విజయ్ సారథ్యంలోని టీవీకే నిలిచినప్పటికీ మెజారిటీకి ఆమడ దూరంలో నిలిచిపోయింది. టీవీకే సంఖ్యాబలం చూపిస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తామని గవర్నర్ తేల్చిచెప్పడంతో గత నాలుగు రోజులుగా అనిశ్చితి కొనసాగుతోంది. ఈనెల 10వ తేదీ వరకూ వరకూ టీవీకేకు గవర్నర్ గడువు ఇచ్చినందున అంతవరకూ వేచిచూస్తామని స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే చెబుతోంది. అన్నాడీఎంకే సైతం ప్రభుత్వం ఏర్పాటు దిశగా పావులు కదుపుతోంది. పార్టీకి చెందిన 40 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని రిసార్ట్‌కు తరలించింది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కూడగట్టుకోవాలంటే వామపక్షాలు, వీసీకే మద్దతు అనివార్యమవుతోంది. సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే కీలక సమావేశాలు జరుపుతున్నందున సాయంత్రానికి కల్లా అనిశ్చితి తొలిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీవీకేకు అనుకూలంగా ప్రజాతీర్పు ఉన్నందున దూకుడుగా వ్యవహరించకుండా వేచిచూడాలని డీఎంకే ఆలోచనగా ఉంది. వీసీకే బలంపరంగా చూస్తే ఆ పార్టీకి విజయ్ గెలిచిన రెండు నియోజకవర్గాలతో సహా 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించడంతో ఆ బలం 113కు చేరింది. టీవీకే బల నిరూపణకు మరో ఆరు సీట్లు అవసరం. (తరువాయి 2వ పేజీలో)

### ఈ-ఫైళ్ల పరిష్కారంలో

# అచ్చెన్నాయుడు నెం. 1



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికతను జోడించి, ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగాన్ని పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ-ఫైళ్ల పరిష్కారంలో చూపిన చొరవ ఒక సరికొత్త రికార్డుకు దారితీసింది. గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సగటున 5 గంటల సమయం పట్టేది. అయితే, మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖకు సంబంధించిన (తరువాయి 2వ పేజీలో)

# ఇండియా కూటమికి గుడ్ బై చెప్పిన డీఎంకే.. ముగిసిన దశాబ్దాల బంధం



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు రాజకీయాల్లో భూకంపం వంటి పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మొదలైన విభేదాలు, ఇప్పుడు జాతీయ స్థాయిలో డీఎంకే - కాంగ్రెస్ మధ్య దశాబ్దాల కాలం నాటి పొత్తు తెగిపోయేలా చేశాయి. టీవీకే అధినేత విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు తెలపడంపై ఆగ్రహంగా ఉన్న డీఎంకే, చివరకు కాంగ్రెస్‌తో బంధాన్ని అధికారికంగా తెంచుకుంది. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, లోక్‌సభలో (తరువాయి 4వ పేజీలో)



ఏపీ ఈసెట్-2026 ఫలితాలను విడుదల చేసిన లోకేశ్

2లో

### పారదర్శకత లేని రాజకీయాల వల్ల రాష్ట్రానికి

# నష్టం జరుగుతుంది: శ్రీభరత్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రాభివృద్ధికి వైసీపీ అడ్డుపడుతోందని, ఏదైనా అభివృద్ధి జరిగితే అది తామే చేశామంటూ క్రెడిట్ తీసుకోవడానికి ప్రయత్నిస్తోందని టీడీపీ విశాఖ ఎంపీ శ్రీభరత్ విమర్శించారు. అభివృద్ధి పనుల విషయంలో ఆ పార్టీ కుట్రలు పన్నుతోందని, గతంలో తాము చేసిన పనులే ఇప్పుడు జరుగుతున్నట్లు నాటకాలు ఆడుతోందని ఆయన ఆరోపించారు. పారదర్శకత లేని రాజకీయాల వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం ఐటీ, పారిశ్రామిక హబ్‌గా మారుతోందని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయని, వాటి సమీపంలోని స్థలాల కోసం మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు పోటీ పడుతున్నాయని వెల్లడించారు. డేటా సెంటర్లు కేవలం ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని భారీ పెట్టుబడులు రాబోతున్నాయన్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### రాచకం..

ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాతి క్షణం నుంచి పశ్చిమ బెంగాల్లో సంఘపరివార శక్తులూ, కేరళలో కాంగ్రెస్ గూండాలూ సాగిస్తున్న హింసాకాండ ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. అధికారంలోకి వస్తే ఏమైనా చేయవచ్చుననే అరాచక ప్రవృత్తిని నిర్భయంగా, నిస్సిగ్గుగా వెల్లడిస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలో తీవ్రమైన విషాన్ని, విద్వేషాన్ని వెళ్లగక్కే నాయకుల అక్కసుకు, అప్రజాస్వామిక ప్రవర్తనకూ తగ్గట్టుగానే- ఆ పార్టీలు పెంచిపోషిస్తున్న అరాచక మూకస్వామ్యం రాజ్యాంగ స్ఫూర్తికి పెను సవాలు. ఈ గూండాగిరి, హింసా ప్రవృత్తి ప్రజాస్వామిక విలువలకు గొడ్డలిపెట్టు. పగ, ప్రతీకార రాజకీయాలు చేసే దాడి కేవలం తమకు ఇష్టం లేని రాజకీయ పక్షాల మీద చేసే దాడి మాత్రమే కాదు; నాగరిక సమాజం మీదా, మానవీయ ప్రవర్తన మీదా చేసే దాడి కూడా! తమకు అనుకూలంగా ఫలితాలు వెలువడ్డ మరుక్షణం నుంచే పశ్చిమ బెంగాల్లో బిజెపి అరాచక శక్తుల స్వైరవిహారం మొదలైంది! ఎన్నికల నిర్వహణకు కేంద్రం నుంచి దించిన వేలాది మంది పోలీసులు ఇంకా విధుల్లో ఉండగానే, వీధుల్లో హింసాకాండ మొదలైంది. సిపిఎం కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తల ఇళ్లూ లక్ష్యంగా దాడులు మొదలయ్యాయి. కార్యాలయాల కూల్చివేతలు, కాల్చివేతలు, దురాక్రమణలూ యథేచ్ఛగా సాగాయి. ముర్షిదాబాద్‌లో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారు. తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయాల పైనా దాడులు, దహనాలూ జరిగాయి. రక్షణ కల్పించాల్సిన పోలీసులు కళ్లప్పగించి చూశారు తప్ప ఎక్కడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. డోమ్‌కల్‌లో పనిప్రదేశం నుంచి ఇంటికొస్తున్న సిపిఎం కార్యకర్త షఫీకుల్ ఇస్లాంపై తాజాగా బిజెపి తీర్థం పుచ్చుకున్న తృణమూల్ గూండాలు కాల్పులకు బరితెగించారు. అక్కడ సిపిఎం అభ్యర్థి గెలుపును జీర్ణించుకోలేక, భౌతికదాడులకు దిగారు. కేరళలో కాంగ్రెస్, ఐయుఎంఎల్ మూకలు కూడా సిపిఎం కార్యాలయాలపై దాడులకు తెగబడ్డాయి. పాలక్కాడ్‌లోని కార్యాలయంలోకి బాంబులు విసిరి, విధ్వంసానికి పాల్పడ్డాయి. 2011లో బెంగాల్‌లో అధికారంలోకి వచ్చాక తృణమూల్ కాంగ్రెస్ ... సిపిఎం కార్యాలయాలపై, నాయకుల ఇళ్లపై, కార్యకర్తల నివాసాలపై, ఆస్తులపై ఇలాంటి దౌర్జన్యాలకే పాల్పడింది. వేలాదిమంది కార్యకర్తలను, సానుభూతిపరులను గ్రామాల నుంచి వెళ్లగొట్టి, తీవ్ర అరాచకం సృష్టించింది. త్రిపురలో 2018లో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక- దాడులూ, దౌర్జన్యాలూ నిరాటంకంగా సాగాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికల్లో నామినేషన్ వేయటానికి కూడా వీల్లేని బీభత్సకాండ అనేక సందర్భాల్లో సాగింది. వామపక్షాల కార్యకర్తలను బెదిరించటం, పోలింగ్ బూత్‌ల నుంచి వెళ్లగొట్టటం యథేచ్ఛగా సాగుతూ వస్తోంది. సుపరిపాలన గురించి సుదీర్ఘమైన ఉపన్యాసాలు దంచే ప్రధాని మోడీ హయాంలోనే ఈ దుర్మార్గం నడుస్తూ ఉంది. కేరళలో 2000-2017 మధ్య బిజెపి, సంఘ్ పరివార శక్తులు 85 మంది సిపిఎం కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నాయి. కాంగ్రెస్, ముస్లింలీగ్ అరాచకవాదులు కూడా దాడులకు, దౌర్జన్యాలకు దిగటం పరిపాటి అయింది. 1972లో బెంగాల్ లో కాంగ్రెస్ పాలకులు అర్ధ ఫాసిస్టు బీభత్సకాండ సాగించారు. 1200 మందికి పైగా సిపిఎం కార్యకర్తలను బలిగొన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. ఒకసారి ప్రజాదరణ పొంది, అధికారంలోకి వచ్చిన పార్టీ మరొకసారి ప్రజాతీర్పుతో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి ఉంటుంది. అధికారమే శాశ్వతమనుకొని, పగ, ప్రతీకారాల పేరిట గూండాగిరి చెలాయించటం ప్రజాస్వామ్యానికి తలవొంపులు తెస్తుంది. తాము తప్ప అందరూ దేశద్రోహులే అనేంత బరితెగింపుతో బిజెపి, దాని పరివారశక్తులూ పార్టీలను, వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవటం ఇటీవల కాలంలో పెరిగింది. అది పెంచిపోషిస్తున్న విద్వేష, విభజన రాజకీయాలు భారతీయ సహజీవన సంస్కృతికి, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయి. ఈ ధూర్త ప్రవర్తనను, దుష్టనీతినీ ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలి. అరాచక శక్తులకు అండగా నిలుస్తున్న అధికార పార్టీల తీరును ఎండగట్టాలి. నూతన ప్రభుత్వాలు ఏర్పడటానికి ముందు జరుగుతున్న ఈ బీభత్సకాండకు ఎన్నికల సంఘానిదే నైతిక బాధ్యత. ఎక్కడికక్కడ అధికార యంత్రాంగాన్ని, పోలీసు బలగాలను అప్రమత్తం చేసి, అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి!

## అన్నాడీఎంకేతో కలిసేందుకు డీఎంకే సిద్ధమవుతోంది: కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ తీవ్ర ఆరోపణలు




**చెన్నై, పతాకం న్యూస్:** విజయ్ ముఖ్యమంత్రి కాకుండా ఉండేందుకు, డీఎంకే పార్టీ అన్నాడీఎంకేతో కలిసి నడిచేందుకు సిద్ధమవుతోందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణికం ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్‌కి అధికారం దక్కకుండా ఉండేందుకు బీజేపీ, అమిత్ షా తమిళనాడులో కుట్ర రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడులో రాజకీయ పరిణామాలు ఊహించని విధంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. తమిళనాడులో ప్రధాన ద్రవిడ పార్టీలపై బీజేపీ తన ఆధిపత్యాన్ని చూపించడం ప్రారంభించిందని అన్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే బీజేపీకి లొంగిపోయిందని, ఇప్పుడు డీఎంకేను కూడా తమ నియంత్రణలోకి తీసుకోవాలని కమలం పార్టీ చూస్తోందని ఆరోపించారు. తమిళనాడులో బీజేపీకి కనీస బలం కూడా లేదని విమర్శించారు. కానీ ద్రవిడ పార్టీల ద్వారా రాష్ట్రాన్ని నియంత్రించాలని చూస్తోందని అన్నారు. తమిళనాడులో బీజేపీకి ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్నారని గుర్తు చేశారు. కానీ విజయ్ ముఖ్యమంత్రి కాకుండా అమిత్ షా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్‌తో బీజేపీ నాటకం ఆడిస్తోందని అన్నారు. బీజేపీ చెప్పినట్లే గవర్నర్ వింటున్నారని మండిపడ్డారు. బీజేపీని తమిళ ప్రజలు అస్సలు క్షమించరని అన్నారు. అధికారం కోసం అన్నాడీఎంకేతో జతకట్టేందుకు డీఎంకే సిద్ధమవుతోందని ఆరోపించారు. కానీ ఎన్నికల తర్వాత తామేదో వెన్నుపోటు పొడిచినట్లు డీఎంకే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తమిళనాడుపై బీజేపీ ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని సూచించారు.

## ఏపీ ఈసెట్-2026 ఫలితాలను విడుదల చేసిన లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ పాలిటెక్నిక్ డిప్లొమో పూర్తయిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ఫలితాల కోసం cets.apsche.ap.gov.in/ECETలో లేదా వాట్సాప్ (మన మిత్ర) 9552300009కు "Hi" అని మెసేజ్? పంపి తెలుసుకోవచ్చు. ఈసెట్ ఫలితాల్లో 91.72 శాతం ఉత్తీర్ణత సాధించారు. 32,434 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ర్యాంక్ కార్డులు సంబంధిత వెబ్‌సైట్‌లో లేదా వాట్సప్ నంబర్ ద్వారా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ లోకేశ్ అభినందనలు తెలిపారు.

## పెన్షన్స్‌పై ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుంది: ఎంపీ శివనాథ్



**విజయవాడ, పతాకం న్యూస్:** పెన్షన్స్‌పై తమ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుందని తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాఖ్యానించారు. ఆయా సమస్యల పరిష్కరానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని చెప్పుకొచ్చారు. తాము హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా అమలు చేశామని వెల్లడించారు. ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వమని అంటున్నారని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని 45వ డివిజన్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ శివనాథ్ పాల్గొని మాట్లాడారు. జగన్ హయాంలో నేతలు, అధికారులు ఎవరు ప్రజల దగ్గరకు వెళ్లింది లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీ శివనాథ్ వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. విజయవాడలోని అన్ని సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులం కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఆయా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. జీవో నంబర్ 30ను తీసుకువచ్చి ప్రతి ఒక్క లబ్దిదారుడుకి రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విజయవాడలో డ్రైనేజీ, కొండ ప్రాంత ప్రజల సమస్యలు త్వరలో పరిష్కారం కాబోతున్నాయని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

## అచ్చెన్నాయుడు నెం.1

(మొదటిపేజీ తరువాయి)

ఫైళ్లను అత్యంత వేగంగా పరిశీలించి, ఆ సమయాన్ని 2 గంటల 49 నిమిషాలకు తగ్గించారు. పరిపాలనలో జాప్యాన్ని తగ్గించి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్న తీరును కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఈ-ఫైళ్ల విధానం అమలులోకి రావడం వల్ల ఫైళ్లు ఎక్కడ ఆగిపోయాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వీలుంటుంది. అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ శాఖ ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటూ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు. రోజుల తరబడి పెండింగ్‌లో ఉండే ఫైళ్లు ఇప్పుడు గంటల వ్యవధిలోనే పరిష్కారం కావడం అనేది పాలనలో పారదర్శకతకు నిదర్శనం. ఒక మంత్రి స్థాయిలో ఫైళ్లు ఇంత వేగంగా క్లియర్ అవ్వడం వల్ల కింది స్థాయి అధికారులపై కూడా సానుకూల ప్రభావం పెరుగుతుంది. రైతులకు సంబంధించిన పథకాలు, రాయితీలు లేదా ఇతర అనుమతులు త్వరగా మంజూరు కావడానికి ఈ వేగం ఎంతగానో దోహదపడుతుంది.

## బెంగాల్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కోల్‌కతా చేరుకున్న అమిత్ షా



**కోల్‌కతా, పతాకం న్యూస్:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ మెజార్టీతో విజయం సాధించింది. ఈ సందర్భంగా అక్కడ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బిజెపి అధిష్టానం నియమించింది. శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొనేందుకు అమిత్‌షా కోల్‌కతా చేరుకున్నారు. ఈ సమావేశంలోనే బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభపక్ష నేతను ఎన్నుకోనున్నారు. ఇప్పటికే బెంగాల్‌లో దీదీని ఓడించిన సువేందు అధికారినే సిఎం అంటూ ప్రచారం సాగుతోంది. కాగా, ఈ సమావేశానికి విమానాశ్రయం నుండి నేరుగా అమిత్ షా ఆ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య, సీనియర్ పార్టీ నాయకుడు సువేందు అధికారితో కలిసి దక్షిణేశ్వర్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అమిత్ షా ఆలయంలో పూజలు నిర్వహించారు.

(మొదటిపేజీ తరువాయి)

## వినూత్నంగా ఆలోచించాలి

నిర్ణయించామని పేర్కొన్నారు. గ్రీవియన్స్ డే విషయంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై నియోజకవర్గాల్లోనూ గ్రీవియన్స్ డే నిర్వహించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ విధానంలో ప్రజాప్రతినిధులు – అధికారులు కలిసి గ్రీవియన్స్ డే నిర్వహించేలా చూడాలని సీఎం సూచించారు. పీజీఆర్ఎస్ కోసం ప్రజాదర్బార్ లాంటి ఓ వేదికను ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. ఫిర్యాదులు స్వీకరించే సమయంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పరిష్కరించే ప్రయత్నం చేద్దామని తెలిపారు. సింగపూర్‌లో ఇదేరకంగా ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారని చెప్పుకొచ్చారు. మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. సమస్యలు పరిష్కారమైతే ప్రభుత్వానికి మంచి పేరురావటంతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఫీల్డ్ గ్రీవెన్స్ డే చాలా ముఖ్యమని తెలిపారు. ప్రజల వద్ద ఆయా సమస్యల కాగితాలు తీసుకుని వదలిపెట్టకుండా.. ఈ పిటిషన్లకు పరిష్కరించాలని హుకుం జారీ చేశారు. ప్రతీ నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగుసార్లు సందర్శించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి గుడ్ విల్ మిషన్‌గా కలెక్టర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని ఆదేశించారు. సంక్షేమంపై కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చర్చించారు. కలెక్టర్లు గ్రీవెన్స్ పేరుతో అర్జీలు తీసుకోని కాగితాలు కారులో పెట్టేస్తున్నారని.. అలా చేయొద్దని ఆదేశించారు. అందుకే చాలా వరకూ ప్రజాసమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రతి నెల చివర తేదీ రాగానే సమస్యలు పరిష్కారమైనట్లుగా బాధితునికి కాకుండా వేరే అడ్రస్‌కు కాగితాలు పంపేసి చేతులు దులుపుకుంటున్నారని.. అలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. వారంలో ఒక రోజు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ పెట్టినా.. మరోరోజు ఆయా నియోజకవర్గాలకు వెళ్లి ప్రజల వద్ద నుంచి అర్జీలు తీసుకోవాలని సూచించారు. అయితే, వారంలో రోజుకొకరు వీడియోకాన్ఫరెన్స్‌లు పెడుతున్నారంటూ కలెక్టర్‌లు ఫిర్యాదు చేశారు. ఇకపై వీడియో కాన్ఫరెన్స్‌లు అన్ని ఒకేరోజు ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## ప్రతిష్టంభన!

టీవీకే భవితవ్యాన్ని నిర్దేశించే బలం వీసీకే, సీపీఐ, సీపీఎం చేతుల్లో ఉంది. వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఈ పార్టీలు టీవీకేతో జతకడితే సింపుల్ మెజారిటీతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటు సాధ్యమవుతోంది. టీవీకేతో పొత్తు ఖరారు చేయాలా వద్దా అనే దానిపై వీసీకే, వామపక్ష పార్టీలు శుక్రవారం సాయంత్రానికల్లా ఒక నిర్ణయం తీసుకోనున్నాయి. ప్రజా తీర్పును గౌరవించాలని మూడు పార్టీలు భావిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే డీఎంకేతో వామపక్షాలు, వీసీకే చిరకాలంగా పొత్తు కొనసాగిస్తున్నందున అవి ఎటూతేల్చుకోలేక పోతున్నాయి. మరోవైపు, త్వరలోనే మంచివార్త చెబుతామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి తాజాగా ప్రకటించడం సంచలనమవుతోంది. అన్నాడీఎంకే, డీఎంకే పొత్తు పొట్టుకుంటాయనే ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీతో పొత్తు తెంచుకుంటేనే అన్నాడీఎంకేకు మద్దతిచ్చే విషయం ఆలోచిస్తామని డీఎంకే వర్గాలు అంటున్నాయి. ఈ క్రమంలో టీవీకేకు వీసీకే, వామపక్షాలు మద్దతు ప్రకటిస్తాయా లేదా అనే దానిపై తమిళనాట ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది.

ఇదిలా ఉండగా తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా బద్ధ శత్రువులుగా ఉన్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే) ఏకమవుతాయని ఊహించడం కూడా కష్టమే. కానీ, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను అధికారానికి దూరం చేసేందుకు ఈ రెండు పార్టీలు అనూహ్యంగా చేతులు కలిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. గవర్నర్ ఆర్.వి. అర్లేకర్‌కు, నటుడు విజయ్‌కు మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. ఏఐఏడీఎంకే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు బయటి నుంచి మద్దతు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇందుకు కొన్ని కీలకమైన షరతులు విధించినట్లు సమాచారం. అందులో ప్రధానమైనది ఏఐఏడీఎంకే తన మిత్రపక్షమైన బీజేపీతో సంబంధాలు పూర్తిగా తెంచుకోవాలి. గత నెలలో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఈ షరతుకు అంగీకరిస్తేనే పొత్తుపై చర్చలు ముందుకు సాగుతాయని డీఎంకే స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదిత కూటమిలో తమ మిత్రపక్షాల ప్రయోజనాలను కాపాడేలా డీఎంకే మరిన్ని షరతులు పెట్టింది. విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) వంటి చిన్న పార్టీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డీఎంకే కోరుతోంది. వీసీకేకు రెండు సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న విజయ్ కూడా వీసీకే మద్దతు కోరారు. అయితే, మంత్రి పదవి ఆఫర్‌తో వీసీకే తిరిగి డీఎంకే గూటికి చేరినట్లు తెలుస్తోంది. డీఎంకే-ఏఐఏడీఎంకే పొత్తుకు మద్దతిచ్చేలా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)లను ఒప్పించే బాధ్యతను కూడా వీసీకే తీసుకున్నట్లు సమాచారం.

అయితే, ఈ అనూహ్య పొత్తుకు వామపక్షాలు సుముఖంగా లేవని తెలుస్తోంది. నాలుగు సీట్లున్న సీపీఎం, సీపీఐ పార్టీలు డీఎంకే-ఏఐఏడీఎంకే కూటమి కంటే విజయ్‌తోనే కలిసి నడిచేందుకు మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మెజారిటీ మార్క్ 118కి చేరువయ్యేందుకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే (మొత్తం 9 సీట్లు) మద్దతు కూడగట్టాలని విజయ్ మొదట ప్రయత్నించారు. కానీ, మారిన పరిస్థితులతో తమిళనాడు రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి.

# ఆప్ పిటిషన్‌పై కేంద్రం సమాధానాన్ని కోరిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎటువంటి ముందస్తు కారణాలు చెప్పకుండా, విచారణ లేదా నోటీసు ఇవ్వకుండా ఆప్ గుజరాత్ యూనిట్ మెటా హ్యాండిల్స్‌ని కేంద్రం నిలిపివేసింది. అలాగే ఆప్ జియో-బ్లాక్ నిలిపివేయమని ఇచ్చిన చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధమైన ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులపై ఆప్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నేడు ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ఆప్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం సమాధానమివ్వాలని ఆదేశించింది. ఆప్ తన పిటిషన్‌లో ఈ చర్య ఒక ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కడమేనని పేర్కొంది. అలాగే బీజేపీ అనుసరించిన విధానం బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొంది. ఆప్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు, గుజరాత్ రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టులో ఆప్ తరపున సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ వాదనలు వినిపించారు. ఆప్ గుజరాత్ యూనిట్ యొక్క మెటా అకౌంట్స్ (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్) రాజకీయ వ్యాఖ్యానాలు, పార్టీ విధానాల ప్రచారం, సంక్షేమ సంబంధిత సమాచారం కోసం అధికారిక హ్యాండిల్స్‌గా పనిచేస్తున్నాయి. వాటిని రాజకీయ ప్రసంగాలకు, ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి చట్టబద్ధమైన వేదికలుగా ఉపయోగించారు. ఇవి రాజ్యాంగంలోని 19ఎ ప్రకరణం (వాక్ స్వాతంత్ర, భావ ప్రకటనా స్వేచ్ఛ) కిందకే వస్తాయి. ప్రతిపక్ష పార్టీల గొంతులను నొక్కేసే చేసే ఏ చర్య అయినా రాజ్యాంగ ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసేదిగా ఉంటుందని, అలాగే అది ప్రజాస్వామ్య మౌలిక స్వరూప సిద్ధాంత ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉందని ఆప్ పేర్కొంది తన పిటిషన్‌లో పేర్కొంది. గుజరాత్ రాష్ట్ర ఆప్ యూనిట్ మొత్తం ఖాతా/పేజీ/గ్రూప్‌ను బ్లాక్ చేయమని ఆదేశించడం అనేది భావ ప్రకటనా స్వేచ్ఛపై ముందస్తు నియంత్రణ విధించడమే అవుతుందని ఫరాసత్ తన వాదనల్లో వినిపించారు. దీన్ని సమర్థించుకోవల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని ఆయన అన్నారు.

## స్మార్ట్ వెండింగ్ జోన్‌కు బ్రేక్

### పనులు నిలిపివేయాలని ఆదేశించిన న్యాయస్థానం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సిటీ సెంట్రల్ పార్కును ఆనుకుని పాత జైలురోడ్డులో ఏర్పాటుచేయతలపెట్టిన స్మార్ట్ వెండింగ్ జోన్‌కు బ్రేక్ పడింది. అనుమతులు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా రూ.ఆరు కోట్ల వ్యయంతో దుకాణాలకు ఏర్పాటుచేస్తున్నారంటూ కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన కోర్టు పనులను తక్షణం నిలిపివేయాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. దీంతో అధికారులు, దుకాణాలు ఆశిస్తున్న వారిలో అయోమయం నెలకొంది. నగరంలో రోడ్లపక్కన ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన దుకాణాలు, తోపుడుబండ్లను జీవీఎంసీ అధికారులు 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో కొన్నాళ్ల కిందట తొలగించారు. దుకాణాలను తొలగించడంతో ఉపాధి కోల్పోయిన వారికి స్మార్ట్ వెండింగ్‌జోన్‌ల ఏర్పాటుతో ప్రత్యామ్నాయం చూపించాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. ముందుగా ఎండాడ, పాతజైలురోడ్డులో వీఎంఆర్‌డీఏ సెంట్రల్‌పార్కును ఆనుకుని ఉన్న స్థలం, దువ్వాడలో స్మార్ట్ వెండింగ్ జోన్‌ల ఏర్పాటుచే యడానికి జీవీఎంసీ కౌన్సిల్ ఉన్నప్పుడు అనుమతి తీసుకున్నారు. కంటెయినర్ మాదిరిగా ఉండే దుకాణాలను ఏర్పాటుచేయడంతోపాటు డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ సదుపాయం కూడా జీవీఎంసీయే కల్పిస్తుంది. దువ్వాడ, ఎండాడ ప్రాంతాల్లో రూ.4.5 కోట్లు చొప్పున, పాతజైలురోడ్డులో రూ.ఆరు కోట్లు వ్యయంతో స్మార్ట్ వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనికయ్యే వ్యయంలో ఒక వాటాను రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ద్వారా కంటెయినర్‌ల తయారీకి సర్దుబాటు చేస్తే, ఒక వాటాను జీవీఎంసీ సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తుంది. మిగిలిన వాటాను లబ్ధిదారులు బ్యాంక్ రుణం ద్వారా జీవీఎంసీకి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పాతజైలురోడ్డులో గతంలో తొలగించిన ఫుడ్‌కోర్టు స్థలంలో స్మార్ట్ వెండింగ్ జోన్ పేరుతో తిరిగి ఫుడ్ కోర్టు ఏర్పాటుచేసేందుకు ఇటీవల స్థానిక ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆ స్థలం వీఎంఆర్‌డీఏకు చెందినది కావడంతో స్మార్ట్ వెండింగ్ జోన్ ఏర్పాటుకు అనుమతించాలంటూ ఆ సంస్థను జీవీఎంసీ అధికారులు కోరారు. అయితే అక్కడి నుంచి ఇంతవరకు లిఖితపూర్వకంగా అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు ఒత్తిడితో సుమారు 200 దుకాణాలు ఏర్పాటుకు పనులు ప్రారంభించేశారు. పనులు ప్రారంభం కాగానే దుకాణాలను కేటాయించేలా చూస్తామంటూ కొందరు ఆశావహుల నుంచి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్హులైన వారికి, ఆపరేషన్ లంగ్స్ కారణంగా నిజంగా జీవనోపాధి కోల్పోయినవారికి దుకాణాలు ఇస్తామని చెప్పి, మార్కెట్‌లో వేలంపాట మాదిరిగా విక్రయించేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు కొందరు ఫిర్యాదుచేశారు. అయినప్పటికీ పనులు ఆపకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం కోర్టు స్మార్ట్ వెండింగ్ జోన్ పనులను తక్షణం నిలిపివేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీచేసింది. దీంతో త్వరగా దుకాణాల ఏర్పాటుపూర్తిచేసి ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందాలనుకున్న అధికారులతోపాటు డబ్బులు ఇచ్చి దుకాణాలపై గంపెడాశలు పెట్టుకున్న ఆశావహులకు షాక్ తగిలింది. హైకోర్టు ఆదేశాలు నేపథ్యంలో కొత్తగా ఎలాంటి నిబంధనలను అమలు చేస్తారోనని కొందరు, అసలు ఆ స్థలంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటుకు కోర్టు అనుమతిస్తుందా?, లేదా? అని మరికొందరు ఆందోళన చెందుతున్నారు.

## మన్యంలో పలు చోట్ల భారీ వర్షం



**అరుకులోయ, పతాకం న్యూస్:** మన్యంలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. జీకే వీధి, హుకుంపేట, ముంచంగిపుట్టులో మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వర్షం పడింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. మిగతా ప్రాంతాల్లో సాధారణ వాతావరణం నెలకొంది. కొయ్యూరు, పాడేరు, జీకేవీధి, జి.మాడుగుల, డుంబ్రిగుడలో 35.5, అరకులోయలో 33.0, చింతపల్లిలో 32.9, అనంతగిరిలో 32.2, ముంచంగిపుట్టులో 31.7, హుకుంపేట, పెదబయలులో 30.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## నగరంలో పారిశుధ్యంపై
# కమిషనర్ కేతన్‌గార్గ్ అసంతృప్తి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో పారిశుధ్య నిర్వహణకు భారీగా ఖర్చు చేస్తున్నా...ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నా సరే బహిరంగ ప్రాంతాల్లో చెత్త కనిపిస్తోందన్నారు. ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, ఏఎంహెచ్‌ఓలు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని, దీనికోసం అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు అదనపు కార్మికుల సేవలను వినియోగించుకోవాలన్నారు. జోనల్ కమిషనర్లు నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లి పారిశుధ్య లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై, దుకాణాల వద్ద ఎవరైనా వ్యర్థాలను వేస్తే వారికి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా ఇప్పటినుంచే చర్యలు ప్రారంభించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. విధులకు హాజరుకాని కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.ల

## వాహనచోదకులకు గ్రీన్‌షెల్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎండలు మండిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండ నుంచి వాహనదారులకు ఉపశమనం కల్పించేందుకు జీవీఎంసీ అధికారులు ముఖ్యమైన కూడళ్ల వద్ద గ్రీన్ షెల్టర్ (హరిత ఆశ్రయం) ఏర్పాటుచేస్తున్నారు. సిగ్నల్ పడినప్పుడు గ్రీన్ షెల్టర్ కింద ఆగే వాహన చోదకులపై నీటి తుంపర్లు పడేలా ఏర్పాటుచేశారు. డాబాగార్డెన్స్ వైపు నుంచి ద్వారకా నగర్ వైపు వచ్చే మార్గంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద మాత్రమే ప్రస్తుతం దీనిని ఏర్పాటుచేశారు. మిగిలిన రూట్లతోపాటు ముఖ్యమైన ఇతర కూడళ్లలో కూడా ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు.

## ప్రజల చెంతకు పాలన చేరేలా కృషి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో పరిపాలనను ప్రజల చెంతకు చేరేలా కృషి చేయాలని అధికారులను జేసీ శ్రీపూజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక గ్రామం- ఒక నెల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అమరావతిలో కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసిన అంశాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిబిరాలకు ఆదరణ



**చోడవరం, పతాకం న్యూస్:** జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, ఉషా అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో చోడవరం పంచాయతీ శివారు అన్నవరంలోని గణేశ్ డిఫెన్స్ అకాడమీలో పాఠశాల విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య (మార్షల్ ఆర్ట్స్) ఉషులో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఉషా మార్షల్ ఆర్ట్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ అయిన పుల్లేటి గణేశ్ శిక్షణ ఇస్తున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా వ్యాప్తంగా సుమారు 50 ప్రదేశాల్లో యోగా, కరాటే, త్రైక్వాండోతోపాటు పలు క్రీడల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు వారికి శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడాలన్న ఉద్దేశంతో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు. అన్నవరంలో నిర్వహిస్తున్న శిబిరంలో సుమారు 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. దాతల సహకారంతో వీరికి వేయించిన వేరుశనగ గుళ్ళు, బెల్లంతో చేసిన చిక్కీలు, రాగిపిండితో చేసిన వంటకాలు, అరటిపండ్లు, ఉడకబెట్టిన కోడి గుడ్లు, తదితర పోషకాహారాలను అందిస్తున్నారు.

## భూసార పరీక్షలతో ఎంతో మేలు



**రాంబిల్లి, పతాకం న్యూస్:** రైతులు భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య పోషక యాజమాన్యం చేపడితేనే సాగు ఖర్చులు తగ్గి, నికర ఆదాయం పెరుగుతుందని హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీహరిరావు అన్నారు. ఆయన మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రాధాన్యతపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేలలో సహజంగా ఉండే పోషకాలను తెలుసుకొని అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వాడడం వలన ఖర్చు తగ్గుతుందన్నారు. రసాయన ఎరువుల అతి వినియోగాన్ని అరికట్టి నేల కాలుష్యాన్ని నివారించవచ్చునని చెప్పారు. దీని వల్ల దిగుబడి పెరగడమే కాకుండా అనవసరపు ఎరువుల ఖర్చు తగ్గడం వలన రైతులకు లాభం చేకూరుతుందన్నారు. రైతులు తమ పొలంలో మట్టి నమూనాలను సేకరించేటప్పుడు పలు నియమాలను పాటించాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీరు, చెత్తచెదారం ఉన్న చోట మట్టిని తీయకూడదని, చెట్ల కింద, గట్ల వెంట లేదా ఎరువుల కుప్పలు వేసిన చోట నమూనాలు సేకరించకూడదని చెప్పారు. ఎకరా పొలంలో 8 నుంచి 10 చోట్ల మట్టిని సేకరించి వాటన్నింటిని బాగా కలిపి చివరిగా అరకిలో మట్టిని గుడ్డ సంచిలో నింపి సమీప భూసార పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. నమూనాతో పాటు రైతు పేరు, తండ్రి పేరు, సర్వే నంబరు, గ్రామం, మండలం మరియు గతంలో వేసిన పంట, రాబోయే కాలంలో వేయదలచిన పంట వివరాలు జతచేయాలన్నారు. మరింత సమచారం కోసం 94407 10538 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని ఆయన కోరారు.

## మోదకొండమ్మ ఉత్సవాలకు ముస్తాబు



**పాడేరు, పతాకం న్యూస్:** స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలకు పాడేరు ముస్తాబవుతోంది. అధికారులు, ఉత్సవ, ఆలయ కమిటీల సమన్వయంతో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి 19 ఉత్సవాలు జరుగుతాయి. అయితే ఈ నెల 12న మోదకొండమ్మ పుట్టిన రోజు వేడుక ఉండడంతో ఆ రోజు నుంచే పాడేరులో ఉత్సవాల హడావిడి మొదలు కానుంది. దీంతో 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇక్కడ ఉత్సవాల సందడి నెలకొంటుందని ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేస్తుండగా, మూలవిరాట్ ఆలంకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. మరో మూడు రోజుల్లో మొత్తం కొత్త రంగుల అలంకరణ పనులు పూర్తి కానున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కోల్‌కతా నుంచి ప్రత్యేకంగా విద్యుత్ అలంకరణ చేసేందుకు ఒప్పందం కుర్చుకున్నారు. గతంలో భూరెడ్డి నాగేశ్వరరావు ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2019లో ఉత్సవాల్లో కోల్‌కతా లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సుమారుగా ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది అదే లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రధాన కూడళ్లలో సైతం పెద్ద విద్యుత్ సెట్టింగ్ కటౌట్‌లతో పాటు వీధుల్లో సైతం లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాల్లో ఎటు చూసినా లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. అలాగే ఉత్సవాలు 17 నుంచి అయినప్పటికీ, మోదకొండమ్మ పుట్టిన రోజు వేడుక ఈ నెల 12న కావడంతో ఆ రోజు నుంచే ఉత్సవాలు ప్రారంభమవుతాయని భక్తులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టుగానే విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ప్రధాన కార్యదర్శులు డీపీ.సురేశ్‌కుమార్, భూరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. అధికారులు భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర వైద్య సేవలు అందించడంలో పాటు రాష్ట్రంలోని పలు గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన సంప్రదాయం కళాకారులను రప్పించి ప్రదర్శనలు ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడంతో ఉత్సవాలు మరింత వైభవంగా జరుగుతాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను కొనియాడిన గవర్నర్ నజీర్



**అమరావతి, పతాకం న్యూస్:** విపత్తులు, అత్యవసర సమయాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు వెలకట్టలేనివని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా లోక్‌భవన్‌లో జరిగిన తలసేమియా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మీ ఇంటికి మీ డాక్టరు పేరిట సంచార వైద్య ప్రాజెక్టును గవర్నర్ ప్రారంభించారు. ఏడు జిల్లాల్లోని సుమారు ఐదు లక్షల మంది పేద కుటుంబాలకు మూడేళ్ల పాటు ఈ ప్రాజెక్టు ద్వారా సేవలు అందుతాయని వెల్లడించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ ఆశయాలకు అనుగుణంగా మానవత్వమే పరమావధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ప్రాథమిక వైద్య సదుపాయన్నందించే లక్ష్యంతో రూపొందించిన "మీ ఇంటికి మీ డాక్టర్" ప్రాజెక్ట్‌ను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన ప్రపంచ రెడ్‌క్రాస్, తలసేమియా దినోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద వచ్చే మూడు ఏళ్లలో 7 జిల్లాలోని సుమారు 5 లక్షల పేద కుటుంబాలకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఉచితంగా ప్రాథమిక వైద్య సదుపాయంతో పాటు మందులను కూడా పంపిణీ చేయడం లక్ష్యమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు.

"రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్‌హెన్రీ డూనాంట్ పుట్టినరోజును ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఇదే రోజున ప్రపంచ తలసేమియా రోజుగానూ గుర్తించాం. ప్రస్తుతం తలసేమియా భయంకరమైన వ్యాధిగా ప్రబలుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఇలాంటి ఆపత్కర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ కోసం పనిచేస్తున్న అందర్నీ అభినందిస్తున్నాను. రెడ్‌క్రాస్ సోసైటీ సభ్యులు, యూత్ రెడ్‌క్రాస్ వారికి అభినందనలు. రెడ్ క్రాస్ సొసైటీ కోసం మా తరపు నుంచి కూడా పూర్తి సహకారం ఉంటుంది." అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. గర్భిణులు, 0-6 సంవత్సరాల వయసు గల పిల్లలకు వైద్య సేవలతో పాటు, మంచాన పడిన వృద్ధులకు వృద్ధాప్య సంరక్షణ అందించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశమని వెల్లడించారు.

## రోడ్లు పనుల్లో నాణ్యతా లోపం

### పూర్తికాకుండానే కోతకు గురైన వైనం



**మక్కువ, పతాకం న్యూస్:** గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మిస్తోంది. అయితే, పనుల నిర్వహణపై కొందరు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పనుల నాణ్యతను పట్టించుకోవడం లేదు. దీంతో పనులు పూర్తికాకుండానే శిథిలమై వర్షాలకు రోడ్లు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లు అవుతుంది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గతేడాది బాగుజోల ప్రాంతాన్ని స్వయంగా సందర్శించారు. గిరిశిఖర గ్రామాల్లో ఇకపై డోలీమోతలు ఉండకూడదని, రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు రూ.12కోటు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా మక్కువ మండలంలోని బాగుజోల నుంచి చెలకమెండంగి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2.75కోట్లు, చెలకమెండంగి నుంచి శిరివర గ్రామం వరకు ఆరు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 9.25కోట్లు మంజూరయ్యాయి. ఆ వెంటనే పార్వతీపురం ఐటీడీఏ అధికారులు టెండర్లు పిలిచి ఏడాది కాలంగా పనులు చేపడుతున్నారు. అయితే ఇంతవరకు కనీసం 30శాతం పనులు కూడా పూర్తికాలేదు, పైగా చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపం, అక్రమాలు చోటుచేసుకొని అనతికాలంలోనే పాడయ్యాయి. ఇటీవల ఆ ప్రాంతంలో కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురై కొట్టుకుపోయాయి. నాసిరకం మెటల్, జీఎస్బీ వాడటంతోపాటు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభించకముందే సీసీ రోడ్డు బీటలు వారి శిథిలావస్థకు చేరుకుందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. బాగుజోల నుంచి శిరివర వరకు మొత్తం ఘాట్ రోడ్డు కావడంతో రెండు వైపులా బెర్మలు నిర్మించి ఉంటే రోడ్డు కోతకు గురయ్యేది కాదని గిరిజనులు అంటున్నారు. పనులను పూర్తిగా కాంట్రాక్టర్‌పైనే వదిలేయడంతో నాణ్యత లోపించి కురిసిన కొద్దిపాటి వర్షానికే జీఎస్బీ అంతా కొట్టుకుపోయి రోడ్డంతా గోతులు మయమైందని ఆవేదన చెందుతున్నారు. చెలకమెండంగి-శిరివర రోడ్డు పనులను కాంట్రాక్టర్ గత మూడు నెలలుగా నిలిపివేశాడు.

## అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేవు



**అరసవల్లి, పతాకం న్యూస్:** అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదిత్యాలయంలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో తమకు ఆకలి బాధలు తప్పడం లేదని దినసరి వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్రిమెంట్ కాపీ ఇవ్వాలని, వేతనాలతోపాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు సక్రమంగా చెల్లించాలని ఆలయ అధికారులు నోటీసులు జారీచేసినా.. కాంట్రాక్టర్ బేఖాతరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వేతనాలు అందక పస్తులుంటున్నామని, తమను ఆదుకోవాలని ఇటీవల ఈవోను వేడుకున్నారు. నిబంధనల మేరకు కాంట్రాక్టరు ఆన్‌లైన్‌లో విధానంలో ఈఎస్ఐ, ఈపీఎఫ్, వేతనాలు చెల్లించాలి. కానీ అందుకు విరుద్ధంగా జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు నేరుగా ఉద్యోగుల చేతికి అందించాడు. ఇది సరికాదని.. ఆన్‌లైన్ చెల్లింపుల రసీదుల కాపీలు అందజేయాలని ఈవో సదరు కాంట్రాక్టరు ప్రతినిధికి తెలిపారు. అలాగే టెండరు అగ్రిమెంట్ సైతం ఇవ్వకపోవడంతో ఈవో ఆయనను మందలించి, వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. అయినా కాంట్రాక్టరు స్పందించకపోవడంతో మళ్లీ ఏప్రిల్ మొదటి వారంలో పిలిచి.. మార్చి నెల వేతనాల బిల్లు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించారు. అయినా నిమ్మకునీరెత్తినట్టు ప్రవర్తించడంతో మళ్లీ గత నెల 15న కార్యాలయానికి పిలిచి మందలించారు. అయినా సరే ఇంతవరకు కాంట్రాక్టరు ప్రవర్తనలో మార్పు లేకపోవడం గమనార్హం. నియోజకవర్గానికి చెందిన అధికారపార్టీ నాయకుడి అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వేతనదారులు సిద్ధమవుతున్నారు.

## ఇండియా కూటమికి గుడ్ బై చెప్పిన డీఎంకే.. ముగిసిన దశాబ్దాల బంధం

(మొదటిపేజీ తరువాయి)

తమ పార్టీ సభ్యులకు కాంగ్రెస్ ఎంపీలతో కాకుండా విడిగా సీటింగ్ కేటాయించాలని డీఎంకే ఎంపీ కనిమొళి స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. కాంగ్రెస్‌తో పొత్తు ముగిసినందున, ఇకపై వారితో కలిసి కూర్చోవడం సముచితం కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ నిర్ణయం 'ఇండియా' కూటమికి జాతీయ స్థాయిలో పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. రాజకీయ వైరం ఇప్పుడు క్షేత్రస్థాయిలో భౌతిక దాడులకు దారితీసింది. మైలదుత్తురైలో కాంగ్రెస్ కార్యకర్తలపై డీఎంకే మద్దతుదారులు దాడులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిన్నటి వరకు మిత్రపక్షాలుగా ఉన్న ఇరు పార్టీల శ్రేణులు ఇలా వీధుల్లో ఘర్షణకు దిగడం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అగ్రనాయకత్వం మధ్య మొదలైన విభేదాలు కార్యకర్తల మధ్య శత్రుత్వానికి దారితీయడం ఆందోళన కలిగిస్తోంది.

కాంగ్రెస్ దూరం కావడంతో డీఎంకే ఇప్పుడు ఒంటరిగా లేదా కొత్త మిత్రుల కోసం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ అండగా నిలవడంతో రాష్ట్రంలో కొత్త పవర్ సెంటర్ ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామాలు కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కూడా ప్రతిపక్షాల ఐక్యతపై ప్రభావం చూపేలా ఉన్నాయి.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోండి




**పాలకొండ, పతాకం న్యూస్:** రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సింగన్నవలస గ్రామాన్ని తహసీల్దార్ సీహెచ్.రాధా కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. గ్రామ ప్రజలతో సమావేశమై వారి వెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక గ్రామం-ఒక నెల- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందన్నారు. ప్రతి గురువారం అధికారులు గ్రామానికి నెలలో నాలుగుసార్లు వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల నమోదు వివరాలు, మందుల నిల్వలు అందుబాటుపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్య క్రమంలో ఎంఎస్‌వో శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, రెవెన్యూ సేవల్లో పారదర్శకతను పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపాలపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న ఒక నెల, ఒక గ్రామం, నాలుగు సందర్శనలు కార్యక్రమంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రెవెన్యూ అధికారులు ప్రతి నెలా నిర్ణీత గ్రామాన్ని నాలుగుసార్లు సందర్శిస్తారని జేసీ తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలపై వినతులను ప్రత్యక్షంగా స్వీకరిస్తారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో తప్పుల సవరణ, సర్వే నెంబర్ల సమస్యలు, సదాబైనమా క్లయిమ్‌లు, ఖాతా మార్పిడి వేగవంతం చేయడం, కుటుంబ భూ వివాదాలు, భూ ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు. పెండింగ్ సమస్యలను తగ్గించి ప్రజల సంతృప్తిని పెంచడమే ఈ కార్య క్రమం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, ఇతరశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేతనదారులు జాగ్రత్తలు తీసుకోండి: ఎంపీ కలిశెట్టి



**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి వేతనదారులు పని వేళలు పాటించాలని..జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జరజాం గ్రామంలోని బుగతవానిచెరువులో ఉపాధి పనులను ఆయన పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఎ.సురేష్‌ను ఎంపీ సత్కరించారు. కొత్తపేటలో ఇటీవల అనారోగ్యం పాలైన సీనియర్ టీడీపీ నాయకుడు అన్నెపు శ్రీమన్నారాయణను ఎంపీ కలిశెట్టి పరా మర్శించారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, పైడి ముఖలింగం, పొన్నాడ అప్పలనాయుడు, కొత్తకోట అమ్మినాయుడు, పప్పల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తతో నిలిచిపోయిన వాహనాలు



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస మేజర్ పంచాయతీకి సంబంధించి నాలుగు చెత్త వాహనాలు చెత్త వేయడానికి ఎటువంటి స్థలం లేక స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలోనే ఉదయం నుంచి నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డులో చెత్త వేయకుండా కొత్తవలస పంచాయతీ రాజన్నకాలనీ వాసులు అడ్డుకోవడం, రెవెన్యూ శాఖ ఎటువంటి ప్రత్యామ్నాయ స్థలం చూపించకపోవడంతో ఈ పరిస్థితి దాపరించింది. డంపింగ్‌యార్డును ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి తరలించాలని జిల్లా అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని ఎంపీడీవో రమణయ్యకు కొత్తవలస పంచాయతీ కార్య నిర్వహణాధికారి ప్రసాద్ కోరారు. ఈమేరకు ఎంపీడీవో.. తహసీల్దార్ రమాలక్ష్మికి స్థలం చూపించాలని సూచించగా, కొత్తవలస పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ స్థలాలను చూపించారు. అయితే అక్కడ ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో తహసీల్దార్ కొత్తవలస సర్వే నెంబరు 173లో స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం డంపింగ్‌యార్డుకు అసలు అనువుగా లేదని, చెత్త వాహనాలు వెళ్లడానికి సరైన రహదారి లేదని, లోతైన గెడ్డ, గెడ్డ దాటి వెళితే కొండ ఉందని, ఇలాంటి ప్రాంతంలో ఎలా చెత్తను డంపింగ్ చేయాలని ఈవో ప్రసాద్ ప్రశ్నించా రు. విశాఖపట్టణం కాపులుప్పాడ ప్రాంతంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తీసుకు వెళ్లాలంటున్నారని, కొత్తవలస నుంచి అక్కడకు సుమారు 50 కిలోమీటర్లు దూరం ఉంటుందని ఆ ప్రాంతానికి తీసుకెళ్లడం సాధ్యమ య్యే పని కాదంటున్నారు. గురువారం సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియకపోవడంతో చెత్త వాహనాలు పంచాయతీ కార్యాలయం వద్దనే ఉండిపోయాయన్నారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డులోనే చెత్త వేయాలంటూ కొత్తవలసకు చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాన్యం దేముడు రిలే దీక్ష చేపట్టా రు. కొంతమంది తమ రాజకీయ లబ్ధి కోసమే డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవసరమైతే డంపింగ్‌యార్డును ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఉంచాలంటూ అమరణ నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి





**తిరుపతి, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే వి ఎన్ కుమార్ అన్నారు. రైల్వేకోడూరు మండలంలో "బడి పిలుస్తోంది -- మన సంకల్పం విద్యా ప్రగతి" కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంపుదల లక్ష్యంగా చేపట్టిన ఈ భారీ ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడిన జిల్లా విద్యాశాఖ అధికారి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న విద్యా సంస్కరణలు, ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, విలువల ఆధారిత బోధన, నైపుణ్యాభివృద్ధి కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మూడు జతల యూనిఫామ్, బూట్లు, సాక్స్, స్కూల్ బ్యాగులు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన, శుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సమగ్ర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చేందుకు క్లిక్కర్స్, పాల్ ల్యాబ్, ఐఎఫ్ పి వంటి సాంకేతిక ఆధారిత బోధనా విధానాలు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల పురోగతిని నిరంతరం అంచనా వేసేందుకు హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్ అమలు చేస్తున్నామని, విద్యార్థుల విద్యా, మానసిక, సామాజిక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల (సి డబ్ల్యూ ఎస్ ఎన్) కోసం ప్రత్యేక శిక్షణ, అవసరమైన ఉపకరణాలు, అనుకూల వాతావరణం కల్పిస్తూ సమాన విద్యా అవకాశాలు అందిస్తున్నామని తెలిపారు.

## లంక భూముల పరిష్కారంలో అలసత్వం రైతుల ఆగ్రహం



**తుళ్లూరు, పతాకం న్యూస్:** లంక, అసైన్డ్ భూముల పరిష్కారంలో అలసత్వం చూపుతున్నారని అధికారులపై రాజధాని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నగర నిర్మాణం నిమిత్తం భూసేకరణ కార్యకలాపాల కోసం రాయపూడి, నేలపాడు గ్రామాల్లో సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు సిఆర్‌డిఎ కమిషనర్ వి. విజయరామరాజు. అడిషనల్ కమిషనర్లు ఎ.భార్గవతేజ, కొల్లాబత్తుల కార్తీక్, గుంటూరు జిల్లా జెసి అశుతోష్ శ్రీవాస్తవ ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు అసైన్డ్, లంక భూముల సమస్యలను సభలో ప్రస్తావించారు. లంక అసైన్డ్ భూములకు చెందిన కొంతమందికి రెండేళ్లు కౌలు ఇచ్చి ఆ తరువాత నిలిపివేశారని, మరికొంత మందికి మాత్రం అలాంటి పరిస్థితి లేదని అన్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాలేదని చెప్పారు. కొంతమంది దగ్గర లంక భూములు ఉన్నాయని, వాటిని భూ సమీకరణలో తీసుకోవాలని కోరుతున్నా అధికారులు ముందుకు రావడం లేదన్నారు. దీనిపై సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు స్పందిస్తూ.. భూమి స్వభావాన్ని బట్టి భూ సమీకరణలో తీసుకుంటామని తెలిపారు. భూములు కృష్ణా నదీ ప్రాంతంలో ఉంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలు ఉంటాయని చెప్పారు. మరోసారి రైతులు,అధికారులు సమావేశమై భూములకు సంబంధించిన పత్రాలను పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాము ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చిన భూమి విస్తీర్ణం కంటే తక్కువగా నమోదు చేశారని మరికొంత మంది రైతులు ఫిర్యాదు చేశారు. రహదారి కారణంగా స్థలాలు, ఇల్లు కోల్పోయే వారికి ఇచ్చే పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపు వివరాలను వెల్లడించాలని కోరారు. రాయపూడితో పాటు నేలపాడులో గ్రామకంతాల సమస్యలను లేవనెత్తారు. గ్రామకంతాల సమస్యలు చాలా వరకు తొలగిపోయాయని, మిగిలిన వాటిని కూడా పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. రాజధాని నగరంలో నిర్మిస్తున్న రహదారులు, ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్ స్కీం) జోన్లు, తదితర అభివృద్ధి ప్రాజెక్టుల నిమిత్తం భూసమీకరణ చేపట్టామని, సమీకరణకు కొందరు రైతులు, భూ యజమానులు ముందుకు రానందున రైతులతో పలుమార్లు చర్చించిన అనంతరం నిర్ణీత విధానంలో మాత్రమే భూసేకరణ ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల చేశామని అధికారులు చెప్పారు. భూ సమీకరణలో పాల్గొనేందుకు రైతులకు ఇప్పటికీ అవకాశం ఉందని, భూసేకరణ ప్రకటనలో పేర్లు ఉన్న సంబంధిత రైతులు నిర్ణీత గడువులోపు భూసమీకరణలో పాల్గొనేందుకు అవకాశముందని కమిషనర్ తెలిపారు.రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నందున, రాజధాని గ్రామాల రైతులు సహకరించాలని అధికారులు కోరారు. వరుసగా 12వ ఏడాది రాజధాని రైతుల బ్యాంకు ఖాతాలలో వార్షిక కౌలు జమను ప్రారంభించామని, ఆధార్ సీడింగ్ కాని బ్యాంకు ఖాతాల్లో కౌలు సొమ్ము జమచేయడం సాధ్యం కావడం లేదని, బ్యాంకు ఖాతాతో ఆధార్ సీడింగ్ వెంటనే చేసుకోవాలని రైతులకు సూచించారు.

## ఏఐ ఎఫెక్ట్.. 1,100 మంది ఉద్యోగులను తొలగించిన క్లౌడ్‌ఫ్లేర్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ సంచలన నిర్ణయం తీసుకుంది. "ఏజెంటెక్ ఏఐ" యుగానికి సిద్ధమయ్యే క్రమంలో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 20 శాతానికి సమానం. తమ మొదటి త్రైమాసిక ఆదాయ వివరాలు వెల్లడించిన అనంతరం, ఉద్యోగులకు ఈ విషయం తెలియజేసింది. ఇది ఖర్చుల కోత కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఏఐ యుగంలో కంపెనీని పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ ఉద్యోగులకు పంపిన మెమోలో స్పష్టం చేశారు. గత మూడు నెలల్లోనే కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు తెలిపారు. ఇంజినీరింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్‌తో సహా అన్ని విభాగాల్లో వేలకొద్దీ ఏఐ ఏజెంట్ సెషన్లు నడుస్తున్నాయని, అందుకే కంపెనీ నిర్మాణాన్ని మార్చాల్సి వస్తోందని వివరించారు. ప్రస్తుతానికి ఈ తొలగింపుల ప్రక్రియ ఒక్కసారికే పరిమితమని, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి కోతలు ఉండవని యాజమాన్యం హామీ ఇచ్చింది. పదే పదే చిన్న కోతలు విధించడం వల్ల ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంటుందని, అందుకే ఒకేసారి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. ఏఐ ఆధారిత ప్రపంచంలో ఒక ఉన్నత స్థాయి కంపెనీ ఎలా పనిచేస్తుందో నిర్వచించడమే తమ లక్ష్యమని తెలిపింది. తొలగించిన ఉద్యోగులకు పరిశ్రమలోనే అత్యుత్తమ ప్యాకేజీ అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

## ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించాలన్న చిదంబరం



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రాని పక్షంలో, గవర్నర్ తన రాజ్యాంగ కర్తవ్యాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం పేర్కొన్నారు. పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం, ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మొదట ఆహ్వానించాలని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం రాజకీయ నియమం మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్యంలో నెలకొన్న బలమైన సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం ఉందో లేదో తేల్చాల్సింది రాజ్‌భవన్ వేదికగా కాదని, శాసనసభలోనే అని చిదంబరం నొక్కి చెప్పారు. అత్యధిక స్థానాలు పొందిన పార్టీ నాయకుడిని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి, ఆపై అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవాలని ఆదేశించడమే సరైన పద్ధతి అని హితవు పలికారు. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పులను గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

# చకచకా రెండు లేన్ల జాతీయ రహదారి నిర్మాణం




**పాడేరు, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా విజయనగరం జిల్లాకు అనుసంధానిస్తూ జాతీయ రహదారి(516-ఈ) నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. చాలా వరకు రోడ్డు నిర్మాణం జరగడంతో రవాణా కష్టాలు తొలగి సుఖ ప్రయాణం సాగుతుందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి చింతపల్లి మండలం లంబసింగి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మీదుగా విజయనగరం జిల్లా బొడ్డవర వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం జిల్లా బొడ్డవర వరకు సుమారుగా 371 కిలోమీటర్ల జాతీయ రహదారిని రూ.1,575 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది.

జిల్లాలో ప్రస్తుతం జాతీయ రహదారి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే ఏజెన్సీలో కొయ్యూరు, జీకేవీ?ధి, చింతపల్లి మండలాల్లోని రోడ్డు పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయి. అక్కడక్కడ చిన్నపాటి ప్యాచ్ వర్క్‌లు మినహా కాకరపాడు నుంచి చింతపల్లి(లంబసింగి) వరకు హైవే పూర్తయింది. అలాగే లంబసింగి నుంచి తాజంగి మీదుగా జి.మాడుగుల, అక్కడ నుంచి పాడేరు వరకు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దీనిలో అక్కడక్కడ రోడ్డు నిర్మాణం జరగ్గా కొన్ని చోట్ల మట్టి పనులు, కాల్వర్టుల నిర్మాణం వంటికి కొనసాగుతున్నాయి. ఇప్పటికే పాడేరు నుంచి హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో రెండు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు శత శాతం పూర్తయ్యాయి. హుకుంపేట మండలం పెదగరువు ప్రాంతాల్లో ఈ ఏడాది జనవరి నుంచి టోల్ ఫీజులు సైతం వసూలు చేస్తున్నారు. అలాగే అరకులోయలోని భల్లుగూడ నుంచి బొడ్డవర వరకు ఉన్న 43 కిలోమీటర్ల రోడ్డు పనులు ఇంకా మొదలు కాలేదు. దాదాపుగా 80 శాతం ఘాట్ మార్గంతో పాటు ఎక్కువగా అటవీ శాఖకు చెందిన ప్రాంతం కావడంతో ఈ మార్గంలోని పనులు ప్రారంభమయ్యేందుకు మరింత సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గతంలో తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ నుంచి విశాఖ ఏజెన్సీ మీదుగా విజయనగరానికి జాతీయ రహదారిని నిర్మించాలనే ప్రతిపాదన 2018లోనే కార్యరూపం దాల్చింది. దీంతో ఏజెన్సీలో కొయ్యూరు నుంచి చింతపల్లి, పాడేరు మీదుగా అరకులోయ వరకు ఉన్న 12 అడుగుల వెడల్పున్న ప్రధాన రహదారిని 23 అడుగుల రహదారిగా రోడ్లు, భవనాల శాఖ విస్తరిస్తే, తర్వాత దానిని తాము 34(తారురోడ్డు) అడుగుల జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తామని నేషనల్ హైవే అథారిటీ అధికారులు రాష్ట్రంలోని రోడ్లు, భవనాల శాఖ అధికారులకు సూచించారు. ఇందులో భాగంగానే 2018, 2019 సంవత్సరాల్లో ఏజెన్సీలోని కొయ్యూరు నుంచి పాడేరు మీదుగా అరకులోయ వరకు ఉన్న రోడ్డును 12 అడుగుల నుంచి 23 అడుగులకు విస్తరించారు. ఆయా రోడ్డు విస్తరణ పనులు పూర్తికావడంతో జాతీయ రహదారి నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ అ?ధికారులు 2020లో తమ పనులు మొదలుపెట్టారు. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, కాకరపాడు(కొయ్యూరు), లంబసింగి, తాజంగి, జి.మాడుగల మండలం వంజరి, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, విజయనగరం వరకు సుమారుగా 371 కిలోమీటర్ల రోడ్డును ఆరు బ్లాక్‌లుగా విభజించారు.

**హైవే నిర్మాణం జరిగే ఆరు బ్లాకులివే:** 1. రాజమండ్రి నుంచి రంపచోడవరం 44 కిలోమీటర్లు. 2. రంపచోడవరం టూ కాకరపాడు 74 కిలోమీటర్లు 3. కాకరపాడు - లంబసింగి, జి.మాడుగుల మీదుగా పాడేరు 134 కిలోమీటర్లు 4. పాడేరు - కొత్తభల్లుగుడ 49 కిలోమీటర్లు 5. భల్లుగుడ - బొడ్డవర 43 కిలోమీటర్లు 6. బొడ్డవర- విజయనగరం 27 కిలోమీటర్లు

## పెళ్లి విందులో ఫుడ్ పాయిజన్.. 39 మందికి అస్వస్థత



**కోనసీమ, పతాకం న్యూస్:** సంతోషంగా సాగుతున్న ఆ పెళ్లి వేడుకలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. అందరూ విందు భోజనం చేసిన కాసేపటికే వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. కడుపునొప్పితో జనం విలవిలలాడారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గురువారం జరిగిన ఒక వివాహ వేడుకలో ఫుడ్ పాయిజన్ ఏకంగా 39 మందిని ఆసుపత్రి పాలు చేసింది. కొత్తపేట మండల పరిధిలోని రామ్మోహనరావుపేటలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అప్రమత్తమైన స్థానికులు బాధితులను హుటాహుటిన ఆసుపత్రులకు తరలించారు. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి సమీపంలోని రామ్మోహనరావుపేటలో ఒక వివాహ వేడుక జరిగింది. గ్రామానికి చెందిన గిడ్డి శాంతారావు తన కుమార్తె వివాహాన్ని ఎంతో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు బంధువులు, మిత్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పెళ్లి అనంతరం అందరూ ఎంతో సంతోషంగా విందు భోజనాలు చేశారు. అయితే భోజనం చేసిన కొద్దిసేపటికే పలువురిలో అస్వస్థత లక్షణాలు కనిపించాయి. ఫుడ్ పాయిజన్ కావడంతో ఒకరి తర్వాత ఒకరికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. ఇలా ఏకంగా 39 మంది అస్వస్థతకు గురికావడంతో పెళ్లింట తీవ్ర ఆందోళన నెలకొంది. బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అప్రమత్తమయ్యారు. తొలుత బాధితులందరినీ వానపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్?సీ) తరలించారు. అక్కడ వైద్యులు బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, మెరుగైన చికిత్స కోసం మూడు అంబులెన్సులను రప్పించారు. బాధితులను కొత్తపేటలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి (సీహెచ్‌సీకి) తరలించారు. అయితే, అస్వస్థతకు గురైన 39 మందిలో ఆరుగురు గర్భిణీ స్త్రీలు ఉన్నారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఎలాంటి రిస్క్ తీసుకోకుండా, వెంటనే వారిని స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. కొత్తపేట సీహెచ్‌సీలో చేరిన బాధితులకు వైద్యులు తక్షణమే మెరుగైన వైద్య సేవలు ప్రారంభించారు. ఫుడ్ పాయిజన్ వల్ల విరేచనాలు, వాంతులు కావడంతో బాధితులు నీరసించిపోకుండా వెంటనే ఫ్లూయిడ్స్ (సెలైన్లు) ఎక్కించారు. ఆసుపత్రిలో చేరిన బాధితుల వయసు నాలుగేళ్ల చిన్నారి నుంచి 55 ఏళ్ల వృద్ధుల వరకు ఉంది. వీరికి వైద్యం అందించేందుకు ప్రత్యేక నిపుణుల బృందాన్ని రంగంలోకి దించారు. జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్ (చిన్నపిల్లల) వైద్యులు బాధితులకు నిరంతరం చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న బాధితులందరి ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కోనసీమ జిల్లాలో జరిగిన ఈ ఫుడ్ పాయిజన్ ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. ఘటన గురించి తెలిసిన వెంటనే ఆయన జిల్లా వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కొత్తపేట సీహెచ్‌సీలో చేరిన బాధితులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. వైద్యం అందించడంలో ఎలాంటి లోపం జరగకూడదని, ప్రతి ఒక్కరినీ జాగ్రత్తగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాలతో వైద్యులు ఎప్పటికప్పుడు బాధితుల ఆరోగ్య పరిస్థితిని వివరిస్తున్నారు. ఫుడ్ పాయిజన్ వల్ల మొత్తం 28 మంది సీహెచ్‌సీలో అడ్మిట్ అయ్యారని, అందరికీ ఫ్లూయిడ్స్ ఇచ్చామని, ప్రస్తుతం ప్రాణాపాయం లేదని వైద్యులు మంత్రికి నివేదించారు.

## పోలవరం నిర్వాసితులకు స్థలం కొనుగోలు, ఇంటి నిర్మాణానికి నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇవ్వాలి

**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం నిర్వాసితులకు స్థలం కొనుగోలు, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలవరం గిరిజనేతర నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో రూ.5.57 లక్షలు ప్రకటించిందని, దీనివల్ల పోలవరం నిర్వాసితులకు ఉపశమనం కలగదని తెలిపారు. రోజురోజుకీ పెరుగుతున్న స్టీలు, సిమెంటు ధరలు, రవాణా ఛార్జీల ప్రకారం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ రూ.10 లక్షలు చేస్తేనే సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పున:పరిశీలించి పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో 2013 భూసేకరణ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, నిర్వాసితులను గందరగోళం చేసే చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వస్వం కోల్పోతున్న చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, వేలేరుపాడు, కుక్కునూరు, దేవీపట్నం, ఎటపాక మండలాల నిర్వాసితుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, గతంలో నిర్మించిన ఇళ్లు నాసిరకంగా ఉండటంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మౌలిక సదుపాయాలు (మంచినీరు, రోడ్లు, స్కూళ్ళు, స్మశానాలు, ఉపాధి) లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం పునరావాస ప్యాకేజీని ప్రతి సంవత్సరం సవరించాలని, ప్రభుత్వం 2013 చట్టంలో నిబంధనలన్నీ తుంగలో తొక్కి, నిర్వాసితులకు అందాల్సిన న్యాయమైన పరిహారాన్ని ఎగవేస్తోందని తెలిపారు. ఈ నాలుగు మండలాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్నందున రవాణా ఖర్చులు ఎక్కువగా ఉంటాయని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 5.57లక్షలు ఏ మూలకూ సరిపోదని వివరించారు.

## ప్రయాణికులున్నా బస్సు ఆపరా?: ఎమ్మెల్యే బోడే ఆగ్రహం



**కంకిపాడు, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆర్‌టిసి బస్సులు ఆపకపోవడంపై స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం కంకిపాడు వైపు నుంచి పెనమలూరు వెళ్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. కంకిపాడు కూడలిలో బస్సు ఆపకపోవడాన్ని గమనించారు. వెంటనే ఫాలో చేసిన ఆయన హైవేపై బస్సు ఆపి డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌టిసి సిబ్బంది వైఖరి బాగోలేదని వారిని మందలించారు. ప్రయాణికులు ఉన్నచోట బస్సు ఆపాలని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని సిబ్బందిని హెచ్చరించారు. గోసాల కూడలి వరకు బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే.. ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళా ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

## పరీక్ష టైంలో టీవీ చూడొద్దని మందలింపు.. డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పరీక్ష సమయంలో టివి చూడొద్దు అని తల్లిదండ్రులు మందలించినందుకు డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రోటిగూడ గ్రామంలో ఈ ఘటన జరిగింది. జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల మేరకు ... గ్రామానికి చెందిన మోత్కూరి లక్ష్మీనారాయణగౌడ్-పద్మ దంపతుల చిన్న కూతురు మోత్కూరి అక్షయ (19) లక్షెట్టిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. వార్షిక పరీక్షలు జరుగుతుండటంతో టివి చూడటం ఆపేసి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. చదువుకోవాలని గట్టిగా చెప్పి టివిని ఆఫ్ చేసి వాళ్లిద్దరూ పనులకు వెళ్లారు. క్షణికావేశంలో ఆ విద్యార్థిని ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆమెను జన్నారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు కరీంనగర్ కు తరలించారు. చికిత్స పొందుతూ అక్షయ మృతి చెందింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్లు తక్షణ అమలు చేయాలి




**అమరావతి, పతాకం న్యూస్:** జనగణన, నియోజకవర్గాల పునర్విభజన వంటి షరతులు లేకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలనే డిమాండ్ చేస్తూ మహిళాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడలో 2కె వాక్ నిర్వహించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ కె.యస్. లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని డి-లిమిటేషన్, జనగణన ప్రక్రియలకు అనుసంధానం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలును ఆలస్యం చేస్తోందని విమర్శించారు. 2023లో పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందినా, షరతులు విధించడం వల్ల అమలు జరగడం లేదన్నారు. డి-లిమిటేషన్‌తో లింకు పెట్టకుండా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర పూర్వ కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ.. 2010లో రాజ్యసభ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును యథాతథంగా అమలు చేసి ఉంటే ఇప్పటికే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చేవన్నారు. ప్రజల ప్రాతినిధ్యం సమానంగా ప్రతిబింబించేలా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని, రాజకీయ ప్రయోజనాల కోసం దాన్ని వక్రీకరించకూడదన్నారు. మహిళలు, పేదలు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వి.సావిత్రి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లును డి-లిమిటేషన్‌కు అనుసంధానం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇందుకు ప్రతిపక్షాలు తమ మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ మహిళా నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లను అమలు చేయకూడదనే కుట్రతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటువంటి ఎత్తుగడలను ప్రదర్శిస్తుందన్నారు. వీటిని మహిళలు తిప్పికొట్టి బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె. శ్రీదేవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు దుర్గాభవాని, దుర్గాంబ, పిఒడబ్ల్యు నాయకులు పద్మ, మహిళా చైతన్య వేదిక నాయకులు రాధ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ, భారత మహిళా మండలి నాయకులు ఉష, సంధ్యారాణి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక విధానంలో అక్రమాలు అరికట్టాలి



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ఆచరణలో అనేక అక్రమాలు, దందాలకు వేదికగా మారిందని, ఇసుక మాఫియాను అరికట్టి సామాన్య ప్రజలకు సక్రమంగా ఇసుక అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, వినియోగదారులకు మాత్రం అదనపు భారం తప్పడం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనరేజ్, లోడింగ్, రవాణా ఖర్చుల పేరుతో మధ్యవర్తులు, లారీ యజమానులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక ట్రక్కు ఇసుక ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోందన్నారు. అధికారికంగా బుకింగ్ చేసుకునేందుకు వెళ్లిన ప్రజలకు 'స్టాక్ లేదు', 'సర్వర్ సమస్య' వంటి సమాధానాలనిస్తూ, మరోవైపు బ్లాక్ మార్కెట్‌లో ఇసుక విక్రయాలు బహిరంగంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అనధికారికంగా ఇసుక తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుక కొరత, అధిక ధరల ప్రభావంతో సామాన్యులు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేస్తున్నారని, మేస్త్రీలు, నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కఠిన పర్యవేక్షణ ఉండాలని, ఇసుక మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు.


## యువకుడి దారుణ హత్య.. యువతి ఇంటి ముందు ఉద్రిక్తత



**సికింద్రాబాద్, పతాకం న్యూస్:** సికింద్రాబాద్ చిలకలగూడలో ఓ యువకుడి దారుణ హత్య ఉద్రిక్తతలకు దారి తీసింది. బీటెక్ విద్యార్థి యువన్‌ను కొందరు దారుణంగా చంపేశారు. ఈ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. యువతి ఇంటి వద్ద యువన్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. నిందితులను తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. యువతి కుటుంబ సభ్యులే యువన్‌పై దాడి చేసి, కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపేశారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. యావన్‌ను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం ఆందోళనకారులు యువతి ఇంటిపై దాడి చేసేందుకు బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జవహర్‌నగర్‌కు చెందిన యావన్ (23) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సీతాఫల్‌మండికి చెందిన ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం అమ్మాయి ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు యావన్‌ను హెచ్చరించారు. అయినా అతను సీతాఫల్‌మండి ఇందిరానగర్‌లో స్నేహితుడి వద్ద ఉంటూ ఆమెను తరచూ కలుస్తున్నాడు.

# 'అధిక కొలెస్ట్రాల్'తో బాధపడుతున్నారా?

అధిక కొలెస్ట్రాల్ అనేది ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఒక ప్రధాన ఆరోగ్య సమస్య. దీనిని తరచుగా 'సైలెంట్ కిల్లర్' అని కూడా అంటారు. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆధునిక వైద్యంలో అనేక చికిత్సా ఎంపికలు ఉన్నప్పటికీ, కొలెస్ట్రాల్ నిర్వహణకు ఆయుర్వేదం సహజమైన, సంపూర్ణమైన విధానాన్ని అందిస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో మీ రోజువారీ అలవాట్లలో కొన్ని ఆయుర్వేద ఆకులు చేర్చుకోవడం వల్ల సహజంగానే కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుందని వివరిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!



పొగాకు మానేయడం, సంతృప్త కొవ్వుల తీసుకోవడం తగ్గించడం, రక్తపోటు నియంత్రణ, ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం అనేవి అధిక కొలెస్ట్రాల్‌ను పరిష్కరించడానికి జీవనశైలి మార్పులు అవసరమనిఅధ్యయనం పేర్కొంది. అలాగే, ఆయుర్వేదంలో పేర్కొన్న అర్జున, తులసి, వేప, కరివేపాకు, మారేడు వంటి ఆకులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా, మంచి కొలెస్ట్రాల్‌ను కూడా మెరుగుపరుస్తాయి. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇవి ఆయుర్వేద వైద్యంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఇందులో యూజినాల్, ఉర్సోలిక్ ఆమ్లం లాంటి సమ్మేళనాలు ఉంటాయని నిపుణులు చెబుతు న్నారు. ఇవి లిపిడ్ల జీవక్రియను మెరుగు పరచడం ద్వారా రక్తంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయని అంటున్నారు. తులసి ఆకుల్లోని యాంటీఆక్సిడెంట్ల లక్షణాలు కొలెస్ట్రాల్ ఆక్సీకరణం చెందకుండా కాపాడతాయని, దీంతో ధమనులలో ప్లేక్ ఏర్పడకుండా అడ్డుకుం టుందని వివరిస్తున్నారు. తులసి ఒత్తిడిని తగ్గించే లక్షణాలు గుండె ఆరోగ్యానికి పరోక్షంగా సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే, దీర్ఘకాలిక ఒత్తిడి కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలను పెంచుతుందని తెలియజేస్తున్నారు. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయం విష పదార్థాలను తొలగించేందుకు మద్దతు ఇస్తుందని సూచిస్తున్నారు. అంతేకాకుండా, శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుందని అంటున్నారు. ఆయుర్వేదంలో అర్జున ఆకులను గుండె ఆరోగ్యానికి శక్తివంతమైన ఔషధంగా పరిగణిస్తారు. ఈ ఆకులలో ఫ్లేవనాయిడ్లు, సపోనిన్లు, టానిన్‌లు వంటి జీవ క్రియాశీలక సమ్మేళనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయని ప్రచురించింది. అలాగే మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయని సూచిస్తున్నారు. తద్వారా మొత్తం లిపిడ్ ప్రొఫైల్‌ను సమతుల్యం చేస్తాయని వివరిస్తున్నారు. అర్జున ఆకులు గుండె కండరాల పనితీరును మెరుగు పరచడంతో పాటు గుండెకు రక్త ప్రసరణను పెంచుతాయని అంటున్నారు నిపుణులు. ఇవి ధమనుల గోడలను బలోపేతం చేస్తాయని వివరిస్తున్నారు. దీని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు రక్తనాళాలలో కొవ్వు ప్లేక్ ఏర్పడటానికి దారితీసే ఆక్సీకరణ నష్టాన్ని నిరోధించడంలో సహాయపడతాయని తెలియజేస్తున్నారు. వీటిని టీ లేదా పొడి రూపంలో క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుందని, సరైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని చెబుతున్నారు. వేప సంప్రదాయ భారతీయ వైద్యంలో ఒక మూలస్తంభం. ఈ ఆకుల్లో ఉండే నింబిన్ వంటి సమ్మేళనాలు అనేవి లిపిడ్ ప్రొఫైల్?పై సానుకూల ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడతాయని అంటు న్నారు. ఈ ఆకులు అధిక కొవ్వు పేరుకు పోవడానికి కారణమయ్యే కఫ దోషాన్ని, రక్తంలో వేడిని పెంచే పిత్త దోషాన్ని సమతుల్యం చేయడానికి సహాయపడ తాయని సూచిస్తు న్నారు. వేపాకు కాలేయ పనితీరును మెరుగుపరచడానికి, శరీరం లోని విషపదార్థాలను తొలగించడానికి సహాయపడతాయని అంటున్నారు. ఫలితంగా, కొలెస్ట్రాల్ జీవక్రియ మెరుగ్గా ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ ఆకుల్లో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయని, ఇవి రక్తనాళాల గోడలపై కొలెస్ట్రాల్ పేరుకుపోవడాన్ని నిరోధిస్తాయని పేర్కొం టున్నారు. దీంతో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని వివరి స్తున్నారు. కరివేపాకు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో చాలా సమర్థవంతంగా సహాయపడతాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ ఆకులో ఆల్కలాయిడ్స్, ఫినోలిక్ వంటి శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మే ళనాలు పుష్కలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమ్మేళనాలు రక్తనాళాల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడ తాయని అంటున్నారు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ ఆక్సీకరణం చెందకుండా నిరోధిస్తాయని వివరిస్తున్నారు. ఈ ఆక్సీకరణ ప్రక్రియే గుండెపోటు, స్ట్రోక్‌కు దారితీసే ధమనుల అడ్డంకులకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఈ క్రమంలో వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది.

# ఆలనా పాలనా లేక అధ్వానంగా అల్లూరి స్మారక ప్రదేశం

## హామీలు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక ప్రదేశాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలోని మంప, రాజేంద్రపాలెంలో గల అల్లూరి స్మారక ప్రదేశాలు ఆలనా పాలనా లేక అధ్వానంగా తయారయ్యాయి. ప్రతి ఏటా అల్లూరి సీతారామరాజు జయంతి, వర్ధంతి నాడు స్మారక ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పడమే తప్ప ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మంప స్మారక ప్రదేశాన్ని మూడేళ్ల క్రితం విశాఖపట్నానికి చెందిన రాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. అల్లూరి స్నానమాచరించిన కొలనును అభివృద్ధి చేశారు. అల్లూరిని బ్రిటిష్ పాలకులు పట్టుకుని కట్టేసిన ప్రదేశంలో గతంలో ఏర్పాటు చేసిన స్థూపాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త స్థూపాన్ని నిర్మించారు. అయితే దానిపై చరిత్రను తెలిపే శిలాఫలకాన్ని ఏర్పాటు చేయకుండా అసంపూర్తిగా ఉంచారు. కొలను మధ్యలో అల్లూరి ధ్యానం చేసే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు గానీ కొలను నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో కొలను నాచు పట్టి పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. ఇక అల్లూరి విగ్రహం ఉన్న స్మారక మందిరాన్ని వాచ్‌మన్ నివాస గృహంగా మార్చేయడంతో పర్యాటకులు ఇక్కడికి వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఇక పార్కు విషయానికి వస్తే పచ్చదనం కరువై బోసిపోయి దర్శనమిస్తోంది. అయితే పార్కు అభివృద్ధి పనులు గత మూడు సంవత్సరాలుగా చేస్తున్నప్పటికీ ఇందుకు ఏ మేరకు నిధులు మంజూరయ్యాయి? ఏ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షలో జరుగుతున్నాయి?,కేటాయించిన నిధులు ఏ మేరకు ఖర్చు చేశారనే దానిపై గోప్యత పాటిస్తున్నారు. దీనిపై ఎవరూ సమాధానం చెప్పడం లేదు.

రాజేంద్రపాలెం స్మారక మందిరాల విషయానికి వస్తే గత ప్రభుత్వ హయాంలో అల్లూరి శత జయంతి ఉత్సవాల పేరిట ఉన్న భవనాలను కూల్చారు. అల్లూరితో పాటు గంటందొర, మల్లుదొర కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసి అప్పటి గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొరతో ఆవిష్కరింపజేశారు. స్మారక ప్రాంతంలో అల్లూరిని కాల్చి చంపిన ప్రదేశం వద్ద చరిత్ర ఆనవాళ్లను సైతం తొలగించి ప్రహరీ నిర్మాణం చేపట్టి భూమిని చదును చేశారు. అయితే దీని నిర్వహణను పట్టించుకోకపోవడంతో స్మారక ప్రదేశం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అల్లూరి స్మారక ప్రదేశాల వద్ద ప్రతి ఏడాది జయంతి, వర్ధంతి రోజున అధికారులు ఆర్భాటం చేయడం తప్పితే పర్యాటకంగా దీనిని తీర్చిదిద్దే చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం అల్లూరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. స్మారక ప్రదేశాల అభివృద్ధికి నివేదికలు తయారు చేయించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉన్నందున మంప, రాజేంద్రపాలెం స్మారక ప్రదేశాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఇది 'ప్రేమతో కొట్టిన దెబ్బ' మాత్రమే..

## అమెరికా-ఇరాన్ ఘర్షణపై ట్రంప్ వ్యాఖ్య



**ఇరాన్:** అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నప్పటికీ, తాము విస్తృత స్థాయి యుద్ధాన్ని కోరుకోవడం లేదని వాషింగ్టన్, టెహ్రాన్ సంకేతాలిచ్చాయి. పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చిందని ఇరాన్ అధికారులు ప్రకటించగా, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు లేదని అమెరికా పునరుద్ఘాటించింది. ఈ ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేలికగా స్పందించారు. "ఇది కేవలం ప్రేమతో కొట్టిన దెబ్బ (లవ్ ట్యాప్)" అని ఆయన వ్యాఖ్యానించారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధాన్ని ముగించి, స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై టెహ్రాన్ స్పందన కోసం వాషింగ్టన్ ఎదురుచూస్తున్న తరుణంలో ఈ ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ప్రతిపాదనలో భాగంగా మూడు దశల ప్రక్రియను సూచించినట్లు సమాచారం. అధికారిక కాల్పుల విరమణ, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించే చర్యలు, దీర్ఘకాలిక ఒప్పందం కోసం 30 రోజుల చర్చలు ఇందులో ఉన్నాయి. అయితే, ఇరాన్ అణు కార్యకలాపాలను అరికట్టడం, హర్మూజ్ జలసంధి గుండా నౌకల స్వేచ్ఛా రవాణాకు హామీ ఇవ్వడం వంటి కీలకమైన అమెరికా డిమాండ్లను ఈ ప్రతిపాదనలో ప్రస్తావించలేదని తెలుస్తోంది. ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు ఐదో వంతు ఈ జలమార్గం గుండానే జరుగుతుంది. అందువల్ల ఇక్కడ ఏ చిన్న అస్థిరత ఏర్పడినా అది అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇదిలా ఉండగా, అమెరికా ప్రతిపాదనపై తాము ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దీంతో దౌత్యపరమైన చర్చలు భవిష్యత్తులో ఘర్షణలను నివారిస్తాయా లేదా అనే దానిపై అనిశ్చితి కొనసాగుతోంది. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేసిన తాజా ప్రతిపాదనను సమీక్షిస్తున్నామని ఇరాన్ తెలిపింది. మరోవైపు అంతర్జాతీయ నౌకల రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్‌ను తిరిగి తెరవడంతో సహా ఈ యుద్ధాన్ని ముగించేలా తక్షణమే ఒప్పందాన్ని కుదుర్చుకోవాలంటూ అమెరికా అధ్యక్షులు ట్రంప్, ఇరాన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. లేనిపక్షంలో మళ్ళీ బాంబుల మోత తప్పదని బెదిరించారు. ఈ వారంలో దక్షిణ కొరియాకు చెందిన సరుకు రవాణా నౌకను హర్మూజ్‌లో దాడి చేశామనడాన్ని ఇరాన్ తోసిపుచ్చింది. పనామా పతాకంతో వెళుతున్న నౌకపై తమ సాయుధ బలగాలు దాడి జరిపాయన్న వార్తలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతూ సియోల్ లోని ఇరాన్ ఎంబసీ ఒక వివరణ ఇచ్చింది.




## టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్!



మిండియా టీ20 కెప్టెన్సీలో మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు సూర్యకుమార్ యాదవ్ నుంచి శ్రేయస్ అయ్యర్‌కు బదిలికానున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2026 తర్వాత అయ్యర్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడని టాక్ వినిపిస్తోంది. ఈ మేరకు బీసీసీఐ శ్రేయస్ అయ్యర్‌కు మెసేజ్ కూడా పంపినట్లు తెలుస్తోంది.

సూర్యకుమార్ నేతృత్వంలో టీమిండియా టీ20 వరల్డ్ కప్ 2026ను గెలిచినప్పటికీ, ఇటీవల పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న అతడిని సారథిగా తప్పించాలని సెలక్షన్ కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. 'స్కై' ఫామ్‌లోకి వస్తాడని కొంతకాలంగా వేచిచూస్తున్నప్పటికీ అతడి ఆటతీరులో మార్పు రాకపోవడంపై ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శ్రేయస్ అయ్యర్ రాణిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 9 ఇన్నింగ్స్‌లో 333 పరుగులు సాధించి 47.57 సగటు, 164.04 స్ట్రైక్ రేట్ నమోదు చేశాడు. దీంతో అయ్యర్‌ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడే శ్రేయస్ కెప్టెన్సీపై ప్రకటన వచ్చే ఛాన్స్ ఉందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా వన్డేలు, టీ20లు రెండింటికీ ఒకే కెప్టెన్ ఉండాలని బోర్డు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. శ్రేయస్‌కు గతంలో భారత టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది. మ్యాచ్ సమయంలో అతడు సహనంగా, ప్రశాంతంగా ఉండే విధానం, పరిణితితో కూడిన నిర్ణయాలు భారత టీ20 జట్టుకు కావాల్సిన లక్షణాలుగా పరిగణించబడుతున్నాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మిచెల్ మార్ష్ సెంచరీ..

# లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం




లఖ్‌నవూ: డబుల్ హ్యాట్రిక్ పరాజయాలతో డీలా పడిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఖాతాలో ఉత్కంఠ విజయం. ఓపెనర్ మిచెల్ మార్ష్ (56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111) తుఫాన్ శతకానికి తోడు బౌలర్లు సమష్టిగా రాణించారు. దీంతో వర్షప్రభావిత ఈ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై లఖ్‌నవూ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 9 పరుగుల తేడాతో నెగ్గింది. సరిగ్గా నెల రోజుల తర్వాత పంత్ సేన మూడో విజయం రుచి చూడడం గమనార్హం. ఈ మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. ముందుగా లఖ్‌నవూ 3 వికెట్లకు 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 38), పంత్ (10 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 నాటౌట్) రాణించారు. ఛేదనలో బెంగళూరు లక్ష్యాన్ని 213 పరుగులుగా నిర్దేశించారు. అయితే, బెంగళరు 19 ఓవర్లలో 203/6 స్కోరుకే పరిమితమై ఓడింది. కెప్టెన్ రజత్ పటీదార్ (31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 61), టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 40), దేవ్‌దత్ పడిక్కళ్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 34) ఫర్వాలేదనిపించారు. ప్రిన్స్ 3, షాబాజ్ 2 వికెట్లు తీశారు. మార్ష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

భారీ ఛేదనలో ఆర్‌సీబీ ఇన్నింగ్స్ ఆశించిన రీతిలో సాగలేదు. ఓపెనర్లు బెథెల్ (4), విరాట్ కోహ్లీ (0) తొలి రెండు ఓవర్లలోనే వెనుదిరిగారు. అయితే కెప్టెన్ రజత్ పటీదార్, దేవ్‌దత్‌తో పాటు చివర్లో డేవిడ్ తమ ఆటతీరుతో విజయంపై ఆశలు రేకెత్తించారు. పవర్‌ప్లేలో 45/2 స్కోరుతో జట్టు వెనుకబడినా.. ఆ తర్వాత రజత్ వేగం పెంచాడు. ఏడో ఓవర్‌లో 6,4 బాదిన అతను దిగ్వ?ష్‌ను లక్ష్యంగా చేసుకుని 9వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో జోరు చూపాడు. అలాగే మయాంక్ ఓవర్‌లోనూ రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఈ దశలో ఆర్‌సీబీ వైపు మ్యాచ్ మొగ్గు చూపింది. కానీ 11వ ఓవర్‌లో దేవ్‌దత్‌ను పేసర్ ప్రిన్స్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. జితేశ్ (1)ను కూడా ప్రిన్స్ అవుట్ చేయగా.. ఆ వెంటనే రజత్‌ను స్పిన్నర్ షాబాజ్ అవుట్ చేయడంతో ఆర్‌సీబీ లయ తప్పింది. అయితే డేవిడ్ భారీషాట్లకు లఖ్‌నవూ శిబిరంలో కాస్త ఆందోళన కనిపించింది. ఈస్థితిలో డేవిడ్‌ను షాబాజ్ 16వ ఓవర్‌లో అవుట్ చేశాడు. కానీ క్రునాల్ (28 నాటౌట్), షెఫర్డ్ (23 నాటౌట్) పట్టు వీడకపోవడంతో చివరి ఓవర్‌లో 20 పరుగులు అవసరమయ్యాయి. 6 బంతుల్లో దిగ్వేష్ 10 పరుగులే ఇవ్వడంతో లఖ్‌నవూ సంబరాల్లో మునిగింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆర్‌సీబీ బౌలర్లను లక్ష్యంగా చేసుకొని బౌండరీలతో హోరెత్తించాడు. అతడికి తోడు నికోలస్ పూరన్, చివర్లో కెప్టెన్ పంత్ సహకరించడంతో లఖ్‌నవూ పటిష్ఠమైన స్కోరందుకుంది. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) ప్రేక్షక పాత్రకే పరిమితం కాగా.. మార్ష్ మాత్రం ఒంటి చేత్తో స్కోరును పరిగెత్తించాడు. ఏ బౌలర్‌నూ వదలకుండా ఎదురుదాడికి దిగి ఫోర్లు, సిక్సర్లతో చెలరేగడంతో 20 బంతుల్లోనే తన ఫాస్టెస్ట్ ఐపీఎల్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 68 పరుగులతో నిలిచింది. అప్పటికి అర్షిన్ చేసింది 8 పరుగులే. ఇక, రెండోసారి వర్షం అంతరాయం కలిగించాక, మ్యాచ్ ఆరంభమైన వెంటనే అర్షిన్‌ను క్రునాల్ అవుట్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మార్ష్ మాత్రం ధాటిని కొనసాగిస్తూ 14వ ఓవర్‌లో 4,4,4,6తో 49 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అనంతరం మరోసారి వర్షంతో మ్యాచ్‌కు 25 నిమిషాల ఆటంకం ఏర్పడింది. అయితే మ్యాచ్ మొదలైన కాసేపటికే మార్ష్ సూపర్ షోకు హాజెల్‌వుడ్ బ్రేక్ వేశాడు. పూరన్‌తో రెండో వికెట్‌కు మార్ష్ 70 రన్స్ జోడించాడు. ఇక పంత్ వచ్చీ రాగానే బ్యాట్ ఝుళిపిస్తూ 17వ ఓవర్‌లో 4,4,6తో చెలరేగాడు. చివరి ఓవర్‌లో పూరన్ వెనుదిరిగినా.. పంత్ ఆఖరి 3 బంతులను 4,4,6గా మలిచి జట్టు స్కోరును 200 దాటించాడు.




# శరవేగంగా 'పవర్ పేట' షూటింగ్




ఇప్పటి వరకు 'సింహం' పేరుతో చాలా డైలాగ్స్ వచ్చాయి. ఇప్పుడిక సందీప్ కిషన్ వంతొచ్చింది. నేను కూడా సింహం అంటూ బర్త్‌డే స్పెషల్‌గా సందీప్ కిషన్ తన అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలుగా 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'పవర్ పేట' రచయిత నుంచి దర్శకుడిగా మారిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పుట్టినరోజు సందర్భంగా, 'పవర్‌పేట' చిత్ర నిర్మాతలు గ్లింప్స్‌తో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ గ్లింప్స్‌ని గమనిస్తే.. థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో హంగామాతో హై వోల్టేజ్ మూడ్‌లో ప్రారంభమైంది. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య హీరో ఎంట్రీ, సిగరెట్ తాగుతూ సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం అలరించింది. ఆ నేల స్వభావం, దానికి శక్తినిచ్చే మనుషుల గురించి చెబుతూ తన పాత్ర ఇంటెన్స్ చూపించారు. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసిరే సీన్‌తో గ్లింప్స్ మరింత మాస్ ఫీల్‌ను అందించింది. సందీప్ కిషన్ ఈ సినిమాలో రగ్డ్ పీరియాడిక్ అవతార్‌లో కనిపిస్తున్నారు. స్టైలిష్ షేడ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, రా యాటిట్యూడ్‌తో ఆయన లుక్ ఆకట్టుకునేలా ఉంది. 'సేనాపతి రవి' అనే పాత్ర పేరును కూడా ఇందులో రివీల్ చేశారు. సందీప్ స్క్రీన్ ప్రెజెన్స్, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు కృష్ణ చైతన్య భారీ స్థాయి మాస్ క్యారెక్టరైజేషన్‌ను ఎంత బలంగా డిజైన్ చేశారో ఈ గ్లింప్స్‌లో స్పష్టమవుతోంది. పాత్ర ఎలివేషన్స్, డైలాగ్స్ ఆయన రచయితగా ఉన్న బలాన్ని మరోసారి చాటాయి. సిగరెట్ వెలిగించే చిన్న సీన్ విషయంలో కూడా దర్శకుడి స్టైల్‌ను తెలియజేస్తోంది. మణిశర్మ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి ఫ్రేమ్‌కు మరింత పవర్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లుగా మేకర్స్ తెలిపారు.

# బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ నర్గిస్ ఫక్రీ



నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల కాంబినేషన్‌లో రాబోతున్న #NBK111 సినిమా గురించి వస్తున్న ఈ లేటెస్ట్ అప్‌డేట్ నందమూరి అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ చిత్రంలో బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ జతకట్టనున్నట్టు సమాచారం. మరోవైపు, 'వీరసింహారెడ్డి' వంటి మాస్ హిట్టు తర్వాత బాలయ్య, గోపీచంద్ వీరిద్దరూ కలుస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. గతంలో గోపీచంద్ మలినేని సినిమాల్లోని ఐటెం సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో మనకు తెలిసిందే. ఈసారి ఆ జోరును మరింత పెంచేందుకు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. 'రాక్ స్టార్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, బాలయ్య ఎనర్జీకి తోడైతే స్క్రీన్ పై గ్లామర్ అండ్ మాస్ విజువల్స్ అదిరిపోతాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

హైదరాబాద్‌లోని ఒక స్టూడియోలో ఈ పాట కోసం చిత్ర బృందం ఒక భారీ సెట్‌ను నిర్మించింది. సమాచారం ప్రకారం, ఈ పాట షూటింగ్ . తమన్ అదిరిపోయే మాస్ ట్యూన్ ఇచ్చారని, బాలయ్య తనదైన సిగ్నేచర్ స్టెప్పులతో రచ్చ చేయబోతున్నారని టాక్. గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను పక్కా మాస్ యాక్షన్ అవతారంలో చూపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.




# సర్కే చునార్' సాంగ్ వివాదం..
# నోరా ఫతేహి క్షమాపణ



బాలీవుడ్ నటి నోరా ఫతేహి 'సర్కే చునార్' పాట వివాదంపై జాతీయ మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈ పాటలో మహిళలను అభ్యంతరకరంగా చిత్రీకరించారన్న ఆరోపణల నేపథ్యంలో, ఆమె ఢిల్లీలో కమిషన్ ముందుకు వచ్చి రాతపూర్వకంగా క్షమాపణలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎవరి మనోభావాలనూ దెబ్బతీయాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. "నన్ను ఆ పరిస్థితిలోకి నెట్టారు. ఒక కళాకారిణిగా నా బాధ్యతను నేను అర్థం చేసుకున్నాను. జరిగిన దానికి క్షమాపణ చెబుతున్నాను," అని నోరా వివరించారు. ఈ వివాదానికి పరిష్కారంగా కొంతమంది అనాథ బాలికల విద్యా బాధ్యతలను స్పాన్సర్ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. కమిషన్ సభ్యులు తనకు ఎంతో సహాయం చేశారని పేర్కొన్నారు.

'కేడీ ది డెవిల్' చిత్రంలోని ఈ పాట హిందీ వెర్షన్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. గత నెలలో ఇదే పాటకు సంబంధించి నటుడు సంజయ్ దత్ కూడా మహిళా కమిషన్ ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు. ఆయన కూడా 50 మంది గిరిజన బాలికల విద్యకు సహాయం అందిస్తానని ప్రకటించారు.

తాను ఈ పాట కన్నడ వెర్షన్‌లో మాత్రమే నటించానని, హిందీ వెర్షన్ సాహిత్యం గురించి తనకు తెలియదని, తన అనుమతి లేకుండానే విడుదల చేశారని నోరా గతంలోనే స్పష్టం చేశారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో మేకర్స్ ఈ పాట హిందీ వెర్షన్‌ను యూట్యూబ్ నుంచి తొలగించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**